# పావన గంగ

-నందుల సుశీలాదేవి

"అబ్బబ్బ! ఏం జనం బాబాయ్"

అవధాని మాటలకు నవ్వేడు చయనులు.

గోదావరి పుష్కరాలకు వచ్చిన యాత్రికుల గుంపును పరిశీలిస్తూ చయనులు మాట్లాడలేదు.

గోదావరి పుష్కరాలను అప్పటికి నాలుగుసార్లు చూసిన అనుభవం వుంది చయనులుకి.

అవధాని పాతికేళ్ళ యువకుడు. తొలిసారిగా పుష్కర విధులను నిర్వహిస్తున్నాడు.

చయనులుకీ ఆశ్చర్యంగానే వుంది.

నేల ఈనినట్టు యింత జనసందోహం గతంలో ఎప్పుడూ లేదు.

సదుపాయాలు పెరిగినకొద్దీ ఎక్కడెక్కడి నుండో పుష్కర యాత్రికులు వేలలో, లక్షల్లో రాజమహేంద్రవరానికి తరలి వస్తున్నారు.

తీర్థ విధులు నిర్వర్తించేవారూ, పుణ్యస్నానాలు ఆచరించేవారూ, మూసివాయనాలు యిచ్చేవారూ, సరిగంగ స్నానాలు ఆచరించాలని ఉత్సాహపడే దంపతులతోనూ పుష్కరాల రేవు కోలాహలంగా వుంది.

అవధాని, చయనులు కోనసీమలో అవిడి నుంచి వచ్చారు.

సంకల్పం చెప్పీ, పిండ ప్రదానాలు చేయించీ యిద్దరూ భారీగా సంభావనలు పొందుతున్నారు.

పగలంతా పుష్కరాల రేవులో విధులు నిర్వర్తించి నాళం వారి సత్రానికో, కంబాల వారి సత్రానికో వెళ్ళి భోజనం చేసి తమకు కేటాయించిన గదిలో నాలుగు ఘడియలు కునుకుతీసేసరికి తెలతెలవారిపోయేది.

నాలుగు రోజులుగా కాలం ఎంత వేగంగా కదిలిపోతోందో వారికి తెలియటం లేదు.

అవధాని ఏ కార్యక్రమాన్నయినా నియమానుసారం నిష్ఠతో చేస్తాడు.

యాత్రికులను విసిగించడు.

వారు సంతోషంతో ఇచ్చే తృణమో, ఫణమో తీసుకుంటాడు.

ఏ వ్యక్తి అయినా తనను ఆశ్రయిస్తే, యథావిధిగా శాస్త్రోక్తంగా విధులను చేయటం అతనికి అలవాటు.

చయనులుకి అవధాని వైఖరి నచ్చడంలేదు. వైదీకాన్ని కూడా వృత్తిగానే పరిగణిస్తాడు చయనులు.

"పూర్వపు రోజులలో పురానికి హితం చెప్పే పురోహితుల అవసరాలు సంఘం చూసుకొనేది. వేదాధ్యయనం చేసుకుంటూ నిర్మలంగా నిష్కళంకంగా వారి జీవితాలు వెళ్ళిపోయాయి. ఈ రోజుల్లో మనం మాత్రం బ్రతకవద్దూ! మన విద్య మనకు తిండిపెట్టాలి. ఇందులో నువ్వు తప్పు పట్టవలసినది ఏముంది?"

చయనులు వాదనలో కొంతవరకూ సత్యం వుందని అవధానికి తెలుసు.

అయినా తన పద్ధతి మార్చుకోలేదు.

చయనులు రెండు మూడు తీర్థవిధులూ, ఓ పది పదిహేను సంకల్పాలూ చెప్పేసరికి అవధాని నిదానంగా మూడో వ్యక్తి దగ్గరే వుండిపోయేవాడు.

రద్దీగా వుందని మంత్రాలను దాటించి వేయడం వంటి అపసవ్యాలు అవధానికి నచ్చవు.

నాలుగోనాడు అవధాని గోదావరిలో నల్గురికి సంకల్పం చెప్పి మెట్ల మీదకు వచ్చి చూస్తే చయనులు జాడ తెలియలేదు.

దూరంగా ఎవరిచేతనో పిండ ప్రదానం చేయిస్తూ హడావుడిగా కనిపించాడు.

పంచను ఓసారి పిండుకొని, శిఖలోని నీళ్ళను విదుల్చుకుంటూ తలెత్తి పావంచాల మీద ఎదురయిన వ్యక్తిని చూసి నిర్ఘాంతపోయాడు అవధాని.

అతనిని చూసి సుభద్ర కూడా తత్తర పడింది.

చేతిలో ఓ చేట వుంది.

మరో చేట దాని మీద బోర్లించి వుంది.

ఆమెతో పాటు ఇద్దరు యాత్రీకులు వున్నారు.

మెడలో నల్లపూసలూ, పసుపుతాడు, మొహాన పచ్చటి పసుపూ, రూపాయంత కుంకుమ బొట్టు, కచ్చాపోసి కట్టుకున్న బందారులంక చీరతో - చూడగానే నమస్కరించాలని వూహ వచ్చే నిండు ముత్తయిదువ రూపం!

అవధానికి నోట మాట రాలేదు.

శిలలా నిలబడిపోయాడు.

ఇంతలో మరొకరు కూడా మూసివాయనం తీసుకొనేందుకు సుభద్రని పిలుస్తున్నారు.

సుభద్ర కళ్ళల్లో సన్నటి నీటిపొర!

ఆమె కన్నులలోని ఏ భావం అవధాని మనస్సులో

లోపలి పొరను తాకిందో అతనికే తెలియదు.

పెదవి దాటి రాబోయిన మాటను కంఠంలోనే నొక్కిపట్టి నిశ్శబ్దంగా తలవంచుకుని అక్కడ నుంచి కదలిపోయాడు.

అన్యమనస్కంగా వున్న అవధానిని చూసి అన్నాడు చయనులు–

"ఏరా? ఆ మెట్ల దగ్గర ఎవరికో బ్రహ్మకావాలిట వెళ్ళిరా!"

అవధాని అన్నాడు–

"బాబాయ్! తలనొప్పిగా వుంది. సత్రంకి వెళ్ళి పడుకుంటాను. నీ పని పూర్తయ్యాక వచ్చేయి"

చయనులు అతనిని తేరిపార చూశాడు.

"గోదావరి నీళ్ళు శీతలం చేసి వుంటాయి. నాలుగు మిరియాలు కొనుక్కుని వెళ్ళు. వంట వాళ్ళని అడిగితే కాసిని పాలు యిస్తారు. మిరయప్పొడి కలుపుకొని తాగు" అనేసి తన కార్యక్రమంలో మునిగిపోయాడు చయనులు.

పరధ్యానంగా సత్రానికి వచ్చాడు అవధాని.

## అమ్మ

ఆమె తలపుల్ని
గర్భాలయంలో తలుపుల్ని
తెరిచింది నువ్వే!
ప్రేమాంకురం ప్రవేశించిందప్పుడే!

చిన్ని తన్నుల వెన్నెల దృశ్యాలు
ఇప్పటికీ కన్నుల లోనే!
తడబడే అడుగుల మధుర ఘడియలు
పదిలం ఆ హృదిలో!
ఎదిగి ఎదిగి ఈ గడ్డను వదిలినా
నీవింకా ఒడిలో బిడ్డగానే జ్ఞాపకం!
విత్తం కోసం పశ్చిమానికి
నీ చిత్తం పోయినప్పుడు
ఆమె కన్నీటికి ఆనకట్ట లేదు!
మెరుపుల్ని చూసి అమ్మ ఒడి చేరావు
వస్తు ఆకాశంలో 'మెరపు'లా మెరిసావు!
ఆమె నీకై ఎప్పుడూ 'క్షమయా ధరిత్రి'!
ఆమె ప్రేమవీచికలు మరీచికలయినప్పుడు
ప్రతీ రాత్రీ అవుతొందక 'కాళరాత్రి'!

–ఎం. వీరేశ్వరరావు

అరుగు మీద గోడకు చేర్లబడి కూర్చున్నాడు.

అతని మస్తిష్కమంతా కొలిమిలా మండుతోంది.

సుభద్రది ఇరుసుమండ గ్రామం. అవధాని తల్లికి దూరపు బంధువు.

ఇక్కడ యిట్లా ఆమెను చూడటం అతనికి అగమ్య గోచరంలా వుంది.

మూసి వాయనాలు అందరూ పట్టరు. ముఖ్యంగా గోదావరి జిల్లాలో కొంతమంది మాత్రమే అందుకు సిద్ధమవుతారు. ఏ ముత్తయిదువయినా ముందుకు వస్తే భారీగా కట్నకానుకలు చెల్లిస్తారు.

చీరలు, పైకం బహుమానాలుగా యిస్తారు.

అవధానికి కణతలు పగిలిపోతున్నాయి.

భోజనం కూడా తిన్నగా చేయలేకపోయాడు.

చయనులు అలసిపోయి మధ్యాహ్నం దాటేక వచ్చాడు.

"అబ్బాయి! ఈరోజు నువ్వు మధ్యలో వచ్చేశావు కాని ఈ రోజు తిథి మంచిది. నేల యీనినట్లు జనం అనుకో! తీర్థ విధులు చేయించుకోవడానికి యాత్రీకులు వరుసలు కట్టి నిల్చున్నారు తెలుసా! ఈ గోదావరి తల్లి దయవలన మా బాబిగాడి ఇంజనీరింగు చదువుకి యింక ఏ ఇబ్బందీ వుండదురా."

తృప్తిగా అన్నాడు చయనులు.

బాగా కష్టపడి వచ్చాడేమో, నాలుగు మెతుకులు నోట్లో వేసుకొనేసరికి నిద్ర ముంచుకొచ్చింది చయనులుకి.

గాఢ నిద్రలో వున్న చయనులుకి నిద్రాభంగం కాకుండా నెమ్మదిగా బయటకు వచ్చాడు అవధాని.

సాయంకాలం నీరెండలో పుష్కరాల రేవులో జనం పలుచ పలుచగా వున్నారు యాత్రీకులు.

పావంచాల మీద కుర్చీని దూరంగా వంతెన మీద పరుగులు పెడుతున్న రైళ్ళను చూస్తూ చాలాసేపు అట్లా కూర్చునిపోయాడు అవధాని.

హఠాత్తుగా ఉలిక్కిపడ్డాడు.

"బాబూ!" అన్న పిలుపు విని వెనుకకు తిరిగి చూశాడు. సుభద్ర నిలబడి వుంది.

మూర్తీభవించిన దైన్యంలా, రూపెత్తిన శోకంలా..

సుభద్ర నిలువునా వణికిపోతోంది. అవధానికి దగ్గర్లో వచ్చి కూర్చుంది.

"అవధానీ! నా మీద అసహ్యంగా వుంది కదూ?"

అవధాని తల వంచుకొన్నాడు.

"ఇంట్లో పెళ్ళికి ఎదిగిన కూతురు. అవిటివాడైన

కొడుకు. ఇంతటి భారాన్ని నా వొంటి రెక్క మీద లాక్కొని వస్తున్నాను. తెలుసుగా! ఏం చేయమంటావు నన్ను. ఇది కొత్త ప్రదేశం. నా గురించి ఎవరికీ తెలియదు. ఈ వారంలో యీ జన సముద్రంలో నాకు తెలిసి వున్న మొహం ఒక్కటీ నాకు తారసపడలేదు. ఈ రోజు.. ఈరోజు.. నువ్వు కనుపించావు."

సుభద్ర కంఠం వణికింది.

దుఃఖోద్వేగంతో ఆవిడ కదిలిపోయింది.

"తప్పో ఒప్పో ఆ గోదావరి తల్లిని నమ్ముకొని వచ్చాను. నా తప్పులన్నీ ఆ నదీమతల్లికి చెప్పుకున్నాను. నా పిల్లలు ఓ ఆరు నెలలపాటు అన్నానికి మొహం వాచిపోకుండా వుంటారు. నా పాపం నన్ను దహించినా పరవాలేదు. నా బిడ్డల ఆకలి తీరుతోంది. అంతకంటె పాప పుణ్యాల గురించి నేను ఆలోచించడంలేదు.

అవధాని కంఠంలో దుఃఖం సుడులు తిరిగింది. అతని మనస్సులో ధర్మాధర్మ మీమాంసతో గలిబిలి అవుతోంది.

అవధాని మొహంలోనికి చూసి అంది ఆవిడ.

"నాయనా! నా తప్పుని నిన్ను సమర్థించమని కోరడంలేదు. నాకు తెలుసును. మీ తాత యజ్ఞం చేశారు. మీ నాన్న నిన్ను పూర్తిగా వైదిక సంప్రదాయంలో పెంచారు. ధర్మహానిని నువ్వు సహించలేవు"

అవధాని మాటలు పేర్చుకుంటూ అన్నాడు.

"అమ్మా! మీ పరిస్థితి నాకు తెలుసును. కాని ఇదా మార్గం? ఎంతమందిని ధర్మచ్యుతులను చేస్తున్నారు.."

సుభద్ర మొహం మ్లానమయింది.

"బాబూ! నువ్వు కష్టపెట్టుకోకు. నీ సంగతి నాకు తెలుసు. బడబాగ్ని వంటి యీ రహస్యాన్ని నీ కడుపులోనే పెట్టుకుంటావు కాని చివరికి కన్న తల్లికి కూడా పెదవి విప్పి చెప్పవు. అది నాకు తెలుసు. ప్రొద్దుట నీ నోటి వెంట ఒక్క మాట బయటకు వచ్చివుంటే నేనేమయిపోయేదానినో వూహించుకోడానికే శక్తి చాలడంలేదు. నా పాపం నన్ను అధోగతికి యీడ్చినా నేను భరిస్తాను. నా బిడ్డల కోసం నేనీ పాపపు బరువుని మోస్తున్నాను"

కాసేపు మౌనంగా వుండి అంది సుభద్ర.

"ఒక్కటి బాబూ! నేను చేసేది తప్పే! కాదనను. కాని నీలాంటి ధర్మమూర్తి దగ్గర నేను ఏం చెప్పగలను? రేపే మా వూరికి వెళ్ళిపోతాను. నన్ను చూస్తూ నువ్వు మధనపడతావు. అది నాకూ సుఖంగా వుండదు"

సుభద్ర హఠాత్తుగా చేతితో నుదుట కుంకుమని తుడిచేసుకోబోయింది.

కాని అంతలో ఆగిపోయింది.

అవధాని కన్నులలో నీరు తళతళలాడుతోంది.

అవ్యాజమైన కరుణతో అతను కదిలిపోయాడు.

"అమ్మా! మీవారు రెండేళ్ళ క్రిందట స్వర్గస్థులయ్యారని నాకు తెలుసును. ఎవరో అపరిచితులైన యాత్రికులకు మీరు ముత్తయిదువ రూపంలో వేషం దాల్చి, వారిచేత సువాసినీ పూజలందుకొంటూ వుంటే నేను భరించలేకపోయానమ్మా! ధర్మచ్యుతి జరగరాదని నాయనగారు చెప్తూ వుంటారు. ఇది మోసం కాదా అమ్మా?"

సుభద్ర కళ్ళు నిప్పు కణికల్లా జ్వలించాయి.

"రోజూ వేలాది మంది యాత్రికులు యీ తల్లి వడిలో జపతపాలు ఆచరిస్తున్నారు. వారందరూ వారి వారి రంగాలలో ధర్మనిరతులేనా? నిన్న మంత్రిగారి భార్య నాకు సువాసిని పూజ చేసింది. తెలుసుగా ఆవిడ

## జననం - మరణం

చెట్టుకి చిగురు తొడిగితే
వసంతం
పండి ఎండి ఆకు రాలితే
శిశిరం
జననం వసంతం
మరణం శిశిరం
తూర్పున సూర్యుడు
విరబూస్తే ఉదయం
పడమటి దిక్కున
వాడి రాలిపోతే అస్తమయం
ఉదయం జననం
అస్తమయం మరణం
నవ్వుల పరిమళాన్ని
పంచుకుంటూ పోతుంది జననం
రెప్పపాటులో
విషాద కేతనాన్ని ఇంటిముందు
ఎగరేసిపోతుంది మరణం
విడిచి ఉండలేని
కవల పిల్లలు
జననం - మరణాలు!

-డి.శ్రీనివాస దీక్షితులు

మనవైపు మనిషి. పదేళ్ళ క్రిందట ఓ పెంకుటింట్లో వుండేవారు. ఈ రోజు కోట్లకు పడగలెత్తారు. నా చిన్నప్పుడు సైకిలు మీద బట్టల మూటలు తెచ్చే వీరాస్వామికి ఈరోజు పట్టణానికో బట్టల కొట్టుంది. వీరంతా నీతికీ, ధర్మానికీ కట్టుబడే వుండి వుంటారా? నేను పండితురాలిని కాను. తప్పో ఒప్పో నా పిల్లలకి నాలుగు రోజులు కడుపునిండా తిండి పెట్టడానికి యీ మార్గం సుగమంగా అనిపించింది. కాని బాబూ! నీ వంటి వేదమూర్తుల ముందు నేను మహా పాపిని. నేను రేపే మా వూరు వెళ్ళిపోతాను. నన్ను చూసి నువ్వు క్షోభపడతావు. అది నాకూ జయం కాదు బాబూ!"

వెక్కి వెక్కి ఏడ్చింది సుభద్ర.

అవధాని తేరుకొని అన్నాడు-

"అమ్మా! మీ యీ చర్య మానవతా ధర్మంతో చూస్తే ఒప్పే అవుతుందేమో నాకు తెలియదు. అంత విమర్శ నేను చేయలేను. నేను యిక్కడకు వస్తూ వుంటాను. మీ కార్యక్రమాన్ని అడ్డుకోనూలేను. ఆమోదించనూ లేను. నన్ను క్షమించండి. దీనికి పరిష్కారం నేను ఆలోచిస్తాను."

సుభద్ర కన్నీటిని కొంగుతో తుడుచుకొని అతనిని చూసింది.

అవధాని స్థిరంగా అన్నాడు.

"మాకు యిల్లు వుంది. భుక్తికి లోపం లేని భూవసతి వుంది. పుష్కర విధులు ఏవిధంగా నిర్వర్తించాలో అనుభవపూర్వకంగా తెలుసుకోవాలని మా వూరి చయనులు గారితో వచ్చాను. మిమ్మల్ని వుండమనీ అనను. వెళ్ళిపోమనీ అనను. అంతటి నిర్ణయాధికారం నాకు లేదు. అంత శక్తీ నాకు లేదు. మీ దారికి నేను అడ్డురాను. నన్ను నమ్మండి. అదేవిధంగా నా మార్గం నేనూ వదలలేను. మీరు వెళ్ళిరండి అమ్మా!"

సుభద్ర ప్రయాసతో లేచి నిలబడింది.

"వెళ్ళొస్తాను బాబూ! నా గుట్టుని రట్టుచేయవని నమ్ముతున్నాను. భగవంతుడు నీకు మేలు చేస్తాడు"

మెల్లమెల్లగా కదిలిపోతున్న ఆవిడను చూసి గాఢంగా నిట్టూర్చాడు అవధాని.

ఎంతసేపో తనని తాను తరచి చూసుకున్నాడు. అంతర్మథనంతో అలసిన అతని మనస్సులో మెరుపులా ఓ ఆలోచన మెరిసింది.

అంతటితో అతని మొహం కళకళలాడింది.

నెమ్మదిగా మెట్లు దిగి గోదావరి నది లోనికి దిగాడు. ముమ్మారు మునిగాడు.

అస్తమయ బింబానికి అంజలి ఘటిస్తూ గాయత్రీ మంత్రాన్ని జపించాడు.

దోసిటతో నీరు తర్పణం చేస్తూ అనుకొన్నాడు.

"తల్లీ! గోదావరి మాతా! అన్ని పాపాలనూ హరించే పరమ పావనివి, వరప్రదాయినివి. ఆవిడ చేసిన హీన కార్యాన్ని మన్నించు తల్లీ! పిల్లల కడుపులు నింపడానికి ఆ తల్లి పడే క్షోభ ఆవిడ చేత యీ పాప కార్యాన్ని చేయిస్తోంది. అమ్మా! పుష్కరమాతా! నీ ప్రవాహపు వడిలో లక్షలాది మంది పుణ్య స్నానాలు చేస్తున్నారు. వారి సమస్త పాపాలను నువ్వు స్వీకరించి వారిని పునీతులని చేస్తున్నావు. సుభద్రమ్మ గారిని కూడా ఆవిధంగానే మన్నించు తల్లీ."

అవధాని మనస్సు నిర్మలంగా అనిపించింది.

మరోసారి ఆ నదీమతల్లికి ప్రణమిల్లుతూ అనుకున్నాడు. "పన్నెండు రోజులూ నిన్ను అర్చించుకోవాలని వచ్చాను. కాని నేను తిరిగి వెళ్ళిపోక తప్పదు. నా ఉనికి ఆ స్త్రీమూర్తికి దుఃఖం కలిగిస్తుంది. నీలోని భాగమైన కౌశికను మిగిలిన రోజులు అర్చించుకుంటాను. ప్రస్తుతానికి నాకు సెలవిప్పించు తల్లీ."

అవధాని మనస్సు తేట పడింది. గోదావరి గలగల నవ్వింది.

ఆ నదీమతల్లి తన చల్లని వాయువుతో అతనిని ప్రేమగా నిమిరింది.

మరొకమారు ఆ జీవ ప్రవాహానికి అంజలి ఘటించి వుత్సాహంగా బయలుదేరాడు అవధాని.

■

## జలపాతం

శిఖరాగ్రం నుంచి
గుండె గుబులుతో
రాళ్ళ మీద తల బాదుకుంటూ
అథః పాతాళానికి
దుమికి దుమికి
నేను ఆత్మహత్య చేసుకుంటుంటే
ఎంత హాయిగా వుంది నీకు?
వాటర్ ఫాల్స్
ఫాల్స్ పేరు పెట్టి
ఆనందిస్తున్నావా మనిషీ?

-గుడిమెట్ల గోపాలకృష్ణ